క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు

జైపూర్: బీఆర్‌ఎస్ మండల ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, ఎంపీటీసీలు నరెడ్ల స్వాతిగోపాల్‌రెడ్డి, బోయిని స్వాతి సంపత్, రాచర్ల సతీశ్, తాజా మాజీ సర్పంచులు ఆడెపు గణేశ్, ఇజ్జగిరి సమ్మయ్య, వెంకటేశ్వర్ గౌడ్‌లు ఆదివారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

‘బీఆర్‌ఎస్‌కు పోరాటాలు కొత్త కాదు’



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రమేశ్

జైపూర్: బీఆర్‌ఎస్ పార్టీకి పోరాటాలు కొత్త కాదని వైస్ ఎంపీపీ రమేశ్ పేర్కొన్నారు. జైపూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి కొందరు నాయకులు పార్టీ వీడినా తమకేమి నష్టం లేదన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చినహామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మేడి సునీత తిరుపతి, టేకుమట్ల ఎంపీటీసీ రవి, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సమ్మయ్య, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి శేఖర్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వద్దు



ఉద్యోగులు, బిల్ కలెక్టర్లను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: పన్ను వసూళ్లలో సిబ్బంది అలసత్వం వద్దని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు వసూలు చేసినందుకు గాను సన్మానించారు. కౌన్సిలర్ రామగిరి బానేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ మజార్, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

షాదీఖానా భూమిని కాపాడండి

బెల్లంపల్లి: పట్టణంలోని షంషీర్‌నగర్‌బస్తీలో షాదీఖానా భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనార్టీ నాయకులు అమానుల్లాఖాన్, అన్వర్‌ఖాన్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాదీఖానా భూమిని కొందరు ఆక్రమించి కట్టడాలు కడుతున్నారని తెలిపారు. పలుమార్లు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా కబ్జాల పర్వం ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా ఆ భూమిని కాపాడడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

12న కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈనెల 12న కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే నివాసంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో జరిగే సమావేశం నిర్వహణ తీరు గురించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్నారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరవుతారని ఎమ్మెల్యే వినోద్ వివరించారు. సమావేశంలో నాయకులు నర్సింగరావు, సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య తెలుసుకుని.. తక్షణమే పరిష్కరించి

తాండూర్: తాండూర్ పంచాయతీ కర్నెల గట్టం గిరిజన ప్రాంతంలో తాగునీటి సమస్యను పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తక్షణమే పరిష్కరించారు. నీటి సమస్య ఉన్న విషయం తెలుసుకుని తెల్లవారుజామునే సిబ్బంది, పంచాయతీ అధికారులతో ఆ గ్రామానికి చేరుకుని చెడిపోయిన మోటార్‌ను మరమ్మతు చేయించి నీటి సరఫరా పునరుద్ధరింపజేశారు. ఆ పక్కనే హ్యాండ్ బోర్ చెడిపోవడంతో దాన్ని బాగు చేయించారు. గ్రామంలోని ఉపాధి కూలీలకు పనులు లేవని తెలియడంతో అప్పటికప్పుడు పనులు మంజూరు చేసి ప్రారంభించారు. ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపస్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వనాలపై పట్టింపేది?



కన్నెపల్లి సమీపంలో బండరాళ్లు ఉండటంతో ఎదగని మొక్కలు

- నిర్వహణ లేక వనాలు అధ్వానం
- ఎండిపోతున్న మొక్కలు
- పర్యవేక్షణ కరువు



శివలింగాపూర్ సమీపంలో ప్రకృతివనంలో ఎండిన మొక్కలు

చెన్నూర్‌రూరల్: పల్లెల్లో ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో నిర్వహణ లేక వనాలు అధ్వానంగా మారుతున్నాయి. వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పట్టింపు లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా 311 పంచాయతీల్లో 545 పల్లె ప్రకృతివనాలు, 73 బృహత్ ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకంలో మొక్కల పెంపకం వాటి నిర్వహణ చేపట్టారు. అయితే చాలావరకు గ్రామాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ప్రకృతివనాలు ఏర్పాటు చేయడంతో అంతగా ప్రజలకు ఉపయోగపడటం లేదు. వేసవిలో నీళ్లు సరిగా లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. చెన్నూర్ మండలం కన్నెపల్లి సమీపంలో ప్రకృతివనానికి సరైన స్థలం లేకపోవడంతో బండరాళ్లు ఉన్న చోట ఏర్పాటు చేశారు. మొక్కలు ఎదగక ఎండిపోతున్నాయి. కత్తెరసాల గ్రామంలో స్థలం లేక చెరువు పక్కనే ప్రకృతివనం ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో చెరువు నిండి వనంలో నీరు చేరడంతో మొక్కలు చనిపోతున్నాయి.

పంచాయతీలదే నిర్వహణ బాధ్యత..

ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు పెంచడంతోపాటు రెండేళ్లు నిర్వహణ చేపట్టారు. మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టేందుకు వాచర్‌ను ఏర్పాటు చేసి కూలీ చెల్లించేవారు. కలుపు తీయడం, మొక్కలకు నీరు పట్టడం వంటి చర్యలు చేపట్టేవారు. కాని నిర్వహణ గడువు ముగియడంతో పంచాయతీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జీపీ పాలకవర్గాల గడువు ముగియడం, ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండటంతో ప్రకృతివనాలపై పట్టింపు లేకుండా పోయింది. నిధుల లేమి, సరిపడా కార్మికులు లేకనే వీటిపై పర్యవేక్షణ కొరవడింది.

> **చర్యలు చేపడుతాం**
>
> పల్లెప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతను పంచాయతీలకే అప్పగించాం. వేసవికాలంలో మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంది. మొక్కలకు నీరందించడం, సంరక్షణ చర్యలు చేపడుతాం.
>
> – అజ్మత్‌అలీ, ఎంపీవో

మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బెల్లంపల్లి: నీటి ఎద్దడి నివారణ కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వేసవికాలం దృష్ట్యా మంచినీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీ ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్, ఆ విభాగం నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 08735–222159, 9381664630, నీటి సరఫరా విభాగం సూపర్‌వైజర్ టి.రాజారాంసింగ్ 8885 149953 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మందమర్రిరూరల్: పట్టణంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 08736–293611, టోల్ ఫ్రీ నంబర్ 18004253611కు కాల్ చేసి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

శ్రీరాంపూర్: వేసవిలో ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నస్పూర్ మున్సిపల్ చైర్మన్ చిట్యాల సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లు హబీబ్ 95550 35732 నంబర్‌కు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫోన్ ద్వారా తాగునీటి ఇబ్బందులు చెప్పవచ్చన్నారు.

‘బీజేపీని ఓడిద్దాం’

పాతమంచిర్యాల: మహనీయుల స్ఫూర్తితో మతోన్మాద పార్టీల ఓడించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి మోహన్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని బీసీ భవన్‌లో కులవివక్ష పోరాట సమితి, వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, మనువాదాన్ని మట్టు పెడుదాం అనే అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, రైతు సంఘం అధ్యక్షుడు సంకె రవి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, కనకరాజు, సమత సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకులు సిద్దార్థ పాల్గొన్నారు.

నేలరాలిన మామిడి



మామిడి కాయలను చూపిస్తున్న రైతులు

దండేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి వీచిన గాలి దుమారానికి పలుచోట్ల మామిడితోటల్లో మామిడికాయలు నేలరాలాయి. దీంతో మామిడిరైతులకు కొంతమేర నష్టం వాటిల్లింది. అధికారులు నష్టాన్ని అంచనా వేసి, తగిన పరిహారం అందించాలని వేడుకున్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



ఉగాది పచ్చడి తయారు చేస్తున్న విద్యార్థులు

కోటపల్లి: మండలంలోని బబ్బన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారీ చేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు.

భీమిని/భీమారం: విశ్వబ్రాహ్మణులు ఉగాదిని ప్రత్యేకంగా జరుపుకుంటారు. పండుగకు ఒక రోజు ముందుగా అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. భీమిని, భీమారం మండలాల్లో విశ్వబ్రాహ్మణులు సోమవారం తీగదారి పూలతో పందిరి వేశారు. మహామ్మాయిదేవి అమ్మవారి చిత్రపటం వద్ద పనిముట్లను అందులో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని తయారు చేశారు.

ఇంటి నిర్మాణం అడ్డగింత

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 64లో అనుమతి లేకుండా చేపట్టుతున్న ఇంటి నిర్మాణ పనులను డీటీఎఫ్ టీం సభ్యులు అడ్డుకుని నిలిపివేశారు. ఈ సర్వే నెంబర్‌లో తన స్థలాన్ని జీవో 59 కింద రెగ్యులర్ చేయాలని ఫీర్‌బేగం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ఇంకా అనుమతి రాలేదు. అయినప్పటికి ఇంటి పనులు మొదలు పెట్టడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్‌లు వెళ్లి పనులు అడ్డుకుని నిలిపివేశారు. ఆర్‌ఐ మాంతయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చెన్నూర్: చెన్నూర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్‌చందర్ గిల్డా, వైస్ ప్రెసిడెంట్‌గా కలగూర రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సెగ్గం రమేశ్, సంయుక్త కార్యదర్శిగా వికాస్ కాచ్‌వా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బండారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం 2025 ఏప్రిల్ వరకు ఉంటుందని ఎన్నికల అధికారి కార్తీక్‌కుమార్ తెలిపారు.

కార్మికులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: ఏఐటీయూసీ పోరాట ఫలితంగా గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి ఖైరిగూడ ఓసీపీ వరకు యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి మూడు షిఫ్టులు బస్సును నడిపేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. బుధవారం సెకండ్ షిఫ్టు నుంచి బస్సు గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి ఖైరిగూడ ఓసీపీ వరకు బస్సు నడుస్తుందని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి సహకరించిన ఏరియా జీఎం రవిప్రసాద్‌కు, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

సాక్షి స్పందన

వేమనపల్లి: మండలంలోని జాజులపేటకు చెందిన హోంగార్డు దుర్గం ధర్మయ్య, అంగన్‌వాడీ టీచర్ కళావతి దంపతులు రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మంచం పట్టారు. ఇంటి, వైద్యఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. వీరి దయనీయ పరిస్థితిని వివరిస్తూ ‘ఆపదలో దంపతులు..!’ శీర్షిక గత మార్చి 25న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మండలంలోని పలువురు ఉపాధ్యాయులు తలాకొంత డబ్బులు పోగుచేశారు. మొత్తం రూ.25 వేల నగదును సోమవారం నీల్వాయిలోని ఆ దంపతుల ఇంటికెళ్లి అందజేశారు. ఉపాధ్యాయులను నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ అభినందించారు.



ధర్మయ్య దంపతులకు రూ.25 వేలు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కల్వర్టు గుంత పూడ్చారు

సాక్షి స్పందన

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు సమస్య పై అధికారులు స్పందించారు. ఈనెల 6న సాక్షిలో ‘కల్వర్టు మరమ్మతులకు మోక్షమెప్పుడో...!’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం స్పందించారు. వెంటనే కల్వర్టు ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి మరమ్మతుకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తపస్ కుమార్, సిబ్బందిని పిలిచి గుంతను కాంక్రీట్‌తో పూడ్చి వేయించారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కరించేలా చూస్తానని ఎంపీడీవో తెలిపారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



గుంతను పూడ్చివేయిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలి

జన్నారం: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని లింగయ్యపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. రోడ్లు, డ్రెయినేజీలు, డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ప్రతీరోజు డ్రెయినేజీలను శుభ్ర పర్చాలన్నారు. తడిపొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్య కార్మికులు పని చేయకపోతే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ రికార్డులు తనిఖీ చేసి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గ్రామంలో నీటి సమస్య ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్, కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

సంక్షిప్తంగా

అడవిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన

మందమర్రిరూరల్: పొన్నారం గ్రామంలో ప్రజలకు అడవిలో అగ్ని ప్రమాదాలపై ఎఫ్‌బీవో రమేశ్, ఎఫ్‌ఎస్‌వో విజయలక్ష్మి సోమవారం అవగాహన కల్పించారు. అడవిలో అగ్ని ప్రమాదం సంభవిస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

కాలినడకన అయోధ్యకు యువకుడు

నెన్నెల: మండల కేంద్రంలోని కొత్తగూడం గ్రామానికి చెందిన యువకుడు పాగిడి రవికుమార్ కాలినడకన సోమవారం యూపీలోని అయోధ్యకు బయల్దేరాడు. నెన్నెల నుంచి 11 వేల కి.మీ దూరంలోని అయోధ్యకు నెలరోజుల పాటు కాలినడకన వెళ్లి చేరుకుంటానని రవికుమార్ తెలిపారు.

సంపత్‌కు నివాళి

మందమర్రిరూరల్: పట్టణంలోని ఎస్వీ టెంపుల్ ఏరియాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు జూపాక సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు నాయకులు హాజరై సంపత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంపత్, రవీందర్, రాయలింగు ఉన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

దండేపల్లి: మండలంలోని కంచరబాయి గిరిజన గ్రామంలోని యువకులకు అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను డీఆర్వో పోచమల్లు సోమవారం పంపిణీ చేశారు. ఎఫ్‌బీవో అనిత, నైట్ పెట్రోలింగ్ టీం, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులను సర్టిఫికెట్లతో సత్కరించారు. ప్రిన్సిపాల్ అయూబ్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు తపస్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. డీఈవో యాదయ్య వీటిని అందజేశారు. డిప్యూటీ అసిస్టెంట్ క్యాంపు అధికారి దామోదర్‌రావు, శ్రీనివాస్, తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్:మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 36వ వార్డుల్లో ఈనెల 10న మంచి నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని కమిషనర్ మారుతి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి వచ్చే మెయిన్ పైప్‌లైన్ మరమ్మతు కారణంగా నీటి సరఫరాను నిలివేస్తున్నామన్నారు.

రిబేటుతో పన్ను చెల్లింపునకు అవకాశం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపులో ఐదు శాతం రిబేటు అవకాశాన్ని కల్పిస్తున్నామని కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. పట్టణ ప్రజలు ఈనెల 30లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

జైపూర్: హైదరాబాద్‌లో సోమవారం రాజ్యాంగ రక్షణ యాత్ర ముగింపు సందర్భంగా మాలమహానాడు బహిరంగ సభకు జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లారు. మాలమహానాడు చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు శీలం వెంకటేశ్, గరిసె రవీందర్, లింగన్న, అలుగునూరి నరేశ్, బీబీ సైనిక్ దళ్ అధ్యక్షులు రమేశ్, మల్లేశ్ ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టే పార్టీకే మద్దతు

పాతమంచిర్యాల: బీసీ బిల్లు ప్రవేశపెట్టే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లుగా చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుడు గజ్జెల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భీమిని: కన్నెపెల్లి మండలం జనకపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం వాగు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారంతోనే సిబ్బందితో దాడి చేసి, పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై గంగారాం తెలిపారు. వారివద్ద నుంచి రూ.31,300 నగదు,8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. భీమిని మండల పరిషత్ కార్యాయలంలో భీమిని, కన్నెపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరందేలా చూడాలన్నారు. భగీరథ అందని ఇళ్లకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ వాటర్ ట్యాంకర్ల ద్వారా అందజేయాలన్నారు. బోర్‌వెల్ తోపాటు పైపులైన్ లీకేజీల సమస్య ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో 200 మంది ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. ఎండతీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో, ఎంపీవో సబ్దర్ ఆలీ, ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీకాంత్, పోశం, కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న అధికారులు

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

వేమనపల్లి: వేసవిలో గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల్లో నీటి సమస్య ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండతీవ్రత కారణంగా కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంతోపాటు నీల్వాయిలో చలివేంద్రాలు ప్రారంభించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో బాపురావు, వెటర్నరీ అధికారి అరుణ, డీటీ కమల్‌సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నరేశ్, సాయి కుమార్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

బాలికపై లైంగికదాడి

జైపూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై శివ్వారం గ్రామానికి చెందిన వైద్య సురేశ్(28) అనే ఆటో డ్రైవర్ లైంగికదాడికి పాల్పడగా నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. సురేశ్ ఇంటి బయట ఆడుకుంటున్న బాలికను తన ఇంట్లో తీసుకెళ్లాడు. సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ లైంగికదాడికి యత్నించగా బాలిక అమ్మమ్మ ఆమె కోసం వెతకగా అక్కడ ఉన్న పిల్లలు సురేశ్ తీసుకెళ్లాడని చెప్పారు. ఆమె వారి ఇంట్లో చూడగా సురేశ్ బాలికను లైంగికదాడి చేసినట్లుగా తెలిపింది. ఈ మేరకు సురేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా ఏసీపీ తెలిపారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

లక్సెట్టిపేట/నస్పూర్: విద్యాసేవ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను లక్సెట్టిపేటకు చెందిన కుశ్నపల్లి దీప్తికి హైదరాబాద్ రవీంద్ర భారతిలో శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నంది అవార్డు అందజేశారు. నస్పూర్‌లోని మార్టిన్స్ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన దీప్తిని, పాఠశాల డైరెక్టర్ సబిహ సుల్తానా, కరస్పాండెంట్ సయ్యద్ మిరాన్ ఇమ్రాన్, ప్రిన్సిపాల్ సయ్యద్ వసీంరాజా సత్కరించారు. అదేవిధంగా లక్సెట్టిపేటలోని దీప్తిని ఆమె నివాసంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అంబేద్కర్ మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, నాయకులు లింగన్న, చిన్నన్న, కాంతయ్య, నారాయణ, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



దీప్తిని సన్మానిస్తున్న మార్టిన్స్ పాఠశాల డైరెక్టర్

గని కార్మికులకు ఇఫ్తార్


బెల్లంపల్లి: రంజాన్‌ను పురస్కరించుకుని బెల్లంపల్లిలోని శాంతిఖని గని ఆవరణలో ముస్లింలకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గని ఆవరణలోని క్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ప్రత్యేక ప్రార్థన చేసిన అనంతరం విందు ఆరగించారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమస్య, ఉపాధ్యక్షుడు ఓదెలు, టీబీజీకెఎస్ పిట్ కార్యదర్శులు వెంకటరమణ, శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎండీ ఓజియార్, అబ్దుల్ ఖాదర్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జైపూర్ చేరిన చైతన్య యాత్ర

జైపూర్: మండల కేంద్రానికి సోమవారం బీసీ ప్రజాచైతన్య యాత్ర చేరుకుంది. చట్టసభల్లో బీసీల వాటా కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ–మేలుకో–రాజ్యం ఏలుకో అన్న నినాదంతో మండలాల్లో గ్రామాలను కలుపుకుని పాదయాత్ర చేపట్టారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేశ్ ఆధ్వర్యంలో పాదయాత్ర జైపూర్ మీదుగా సాగింది. బీసీ జిల్లా కన్వీనర్ మనోహర్, బీసీ నాయకులు నీరటి రాజన్న, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య, బీసీ నాయకులు శంకర్, రాజు, భాస్కర్, శ్రీనివాస్, యాదగిరి ఉన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి ఆర్థికసాయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి సుశ్రితకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. అంతర్జాతీయ పోటీల్లో ఆమె పాల్గొనేందుకు కొక్కిరాల రఘుపతి రావు చారిట్రబుల్ ట్రస్ట్, మంచిర్యాల జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 15 వేల ఆర్థికసాయం అందజేశారు. జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే